
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 22 మే 2024 | 5



ఎండా కాలమ్ — అమలాపురం: గరిష్ఠం 37, కనిష్ఠం 30

కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు ఇక లేరు - 7లో



వెంటిలేటర్‌పై పంట కాల్వ

కోనసీమలో వ్యవసాయానికి ముప్పు ముంచుకొస్తోందా? నీటి లభ్యత లేక పొలాలను బీడు పెట్టుకోవల్సిందేనా? ఎందరో రైతుల ఆవేదన ఇది. అందుకు బలమైన కారణాలు లేకపోలేదు. కోనసీమ అంటే అందరికీ గుర్తొచ్చేది పంట కాల్వలు. కొబ్బరి చెట్లు.. పచ్చని పొలాలు...కాల్వ గట్లపై విహారం, కాల్వల్లో స్నానం. తలుచుకుంటేనే ఎంతో హాయిగా ఉంటుంది. ఇది గతం. ప్రస్తుతం కోనసీమలో పంట కాల్వలు కొన ఊపిరితో ఉన్నాయి. రూపురేఖలు మార్చుకున్నాయి. నిర్దేశిత లక్ష్యాన్ని సాధించలేని బలహీన పరిస్థితిలో ఉన్నాయి. పంట కాల్వల అనారోగ్యానికి స్పందించే నాథుడే కరువయ్యాడు. పంట కాల్వలతో ప్రయోజనం పొందుతున్న రైతులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కోనసీమ పొలాలకు ముప్పు ముంచుకొస్తోంది. అవసాన దశలో ఉన్న కాల్వలకు అత్యవసర చికిత్స చెయ్యకుంటే పొలాలు బీడువారక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు పంట కాల్వలకు ఏమైందో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

- ఆకృతి మార్చుకుంటున్న పంట కాల్వలు
- నీటి ప్రవాహ వేగంలో పెను మార్పులు
- దిగువకు చేరని సాగునీరు
- పూడికతీతలో నిబంధనలకు నీళ్లు
- ఉపాధి హామీ పథకం పనులతో అసలు కొలతలకు ఎసరు
- కాల్వల నిర్వహణపై రైతుల నిర్లక్ష్యం
- కోనసీమలో వ్యవసాయానికి ముంచుకొస్తున్న ముప్పు


వాడపర్రు పంట కాల్వపై అడుగడుగునా వంతెనలు

ఉప్పలగుప్తం, మే 21: కోనసీమకు పంట కాల్వల ద్వారా ధవళేశ్వరం నుంచి నీరందుతుంది. ఇక్కడ ప్రారంభమైన నీటి ప్రవాహం అన్ని మండలాల్లోనూ శివారు ప్రాంతాల వరకు కొనసాగుతుంది. అందుకు అప్పట్లో అపర భగీరథుడు కాటన్ పంట కాల్వల ఆకృతికి రూపకల్పన చేశాడు. ప్రధాన కాల్వల ద్వారా ఆయా ఇరిగేషన్ సెక్షన్లకు చేరిన నీటిని కొలమానం ప్రకారం మండలాల్లో ప్రధాన పంట కాల్వలకు విడుదల చేస్తారు. ఇక్కడ నిర్ణయించిన ప్రవాహ వేగం కారణంగా ప్రధాన కాల్వ నుంచి బ్రాంచి కాల్వలు, పిల్ల కాల్వలు, పంట బోదెల ద్వారా పొలాలకు నీరు కొనసాగుతుంది. ప్రవాహ వేగంలో ఎక్కడ తేడా వచ్చినా శివారు ప్రాంతాలకు నీరందడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. అయితే దశాబ్దాలు గతించడంతో కాల్వల కొలతలు వివిధ కారణాల వల్ల మారిపోయాయి. అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిని ఉదాహరణగా తీసుకుంటే.. ఉప్పలగుప్తం మండలానికి ఇక్కడి నుంచి మూడు ప్రధాన పంట కాల్వల ద్వారా నీటిని మళ్లిస్తున్నారు. ఇందులో లక్ష్మీవాడ-వాడపర్రు కాల్వను తీసుకుందాం. ఈ కాల్వ ప్రారంభంలో నాలుగు మీటర్ల వెడల్పు ఉంటుంది. చివరకు వచ్చేసరికి వెడల్పు 1.20 మీటర్లు ఉండేలా రూపొందించారు. 13 కి.మీ. పొడవుండే ఈ కాల్వ ఆయకట్టు మూడు వేల ఎకరాలు. ఈ కాల్వ ప్రారంభంలో 1.37 మీటర్ల లోతు, శివారులో 1.06 మీటర్ల లోతుండాలి. కానీ ఈ లెక్కలు ప్రస్తుతం రికార్డుల్లో మాత్రమే ఉన్నాయి. ఈ కాల్వ ఎక్కడ ఏ కొలతల్లో ఉందో రైతులకు, అధికారులకు తెలియనిది కాదు. ఫలితంగా ఈ కాల్వ ఆయకట్టు శివారు రైతులు రెండు పంట సీజన్లలోనూ సాగునీటికి రోడ్డెక్కుతూనే ఉన్నారు. లెక్కప్రకారం నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు, మా పొలాలు ఎండిపోతున్నాయంటూ రైతులు ఘర్షణ పడటం సాధారణమైంది. లెక్కప్రకారం నీటి విడుదల జరిగినా కాల్వల కొలతలు లెక్క తప్పడంతో నీటి ఇక్కట్లు తప్పడం లేదన్న సంగతి మాత్రం కొందరికే తెలుసు. గతంలో క్లోజర్ పనుల్లో పంట కాల్వల తవ్వకాలు నిబంధనల ప్రకారం జరిగేవి. ఇప్పుడు క్లోజర్ పనుల్లేవు. శివారుకు నీరందని సమయంలో ఉపాధి కూలీలు, యంత్రాలతో పూడికతీత పనులు చేపడుతున్నారు. వీటిపై ఇరిగేషన్ సిబ్బంది అజమాయిషీ ఉండదు. ఈ కారణంగా కాల్వ కొలతలు కిలోమీటరుకు ఒకలా మారిపోయి పంట సమయంలో రైతుల తలరాతలు మారిపోతున్నాయి. ఇప్పుడైనా అసలు లోపాలను గుర్తించి పరిష్కరించకపోతే కోనసీమ పొలాలకు నీటి గండం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దగ్గరుండి నిర్వహణ పనులు చేయించేవారు



నడింపల్లి సూర్యనారాయణరాజు
రైతు నాయకుడు, ఎన్.కొత్తపల్లి

నీటి సంఘాల ఆధ్వర్యంలో దగ్గరుండి డైరెక్టర్లు పనులు చేయించేవారు. కాల్వల కొలతలు చెడిపోకుండా పూడికతీత పనులు జరిగేవి. రైతులంతా కలిసి కాల్వలను బాగుచేసుకునేవారు. ఇప్పుడు ఉపాధి కూలీల పనులతో అంతా అస్తవ్యస్తంగా ఉంది. కాల్వలు కొన్నిచోట్ల లోతుగా, మరికొన్ని ప్రాంతాల్లో మేటవేసి నీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదు.

ప్రారంభంలోనే ప్రవాహం తీరు సరిగాలేదు

మారిశెట్టి పుండరీకాక్షుడు,
రైతు, విశ్రాంత సైనికోద్యోగి, వాడపర్రు

వాడపర్రు-లక్ష్మీవాడ కాల్వ ప్రారంభంలోనే నీటి ప్రవాహం సరిగ్గా లేదు. ఇక దిగువకు నీరు ఎలా ప్రవహిస్తుంది. కాల్వ కొలతలు మారడంతో ప్రవాహ వేగంలో మార్పులు జరిగి రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా కాల్వల కొలతలు సరిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి



అరిగెల నానాజీ, నీటి పంపిణీ సంఘం మాజీ అధ్యక్షుడు

ఎప్పుడో రూపొందించిన కాల్వల డిజైన్ క్రమంగా అనేక మార్పులకు లోనైంది. ఇందులో రైతులు సహా అందరి పాత్ర ఉంది. గతంలో వేసవిలో ఇరిగేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో కాల్వలను మరమ్మతు చేసేవారు. అనంతరం చోటుచేసుకున్న మార్పులతో కాల్వల కొలతలు మారిపోయి అన్ని ప్రాంతాలకు సమానంగా నీరందట్లేదు. రైతులు, జలవనరుల శాఖ విశ్రాంత ఉద్యోగులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. ఆ కమిటీ అధ్యయనం అనంతరం ఇచ్చిన నివేదిక ఆధారంగా అవసరమైతే ఒక ఏడాది దాళ్వాను నిలిపి పంట కాల్వల నిర్వహణ పనులు చేపట్టాలి.

ఆధునికీకరణ చేయకపోతే వ్యవసాయం సాగదు



అయితాబత్తుల ఉమామహేశ్వరరావు
కోనసీమ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి

పైరు ఎండిపోయే సమయంలో రైతులు ఆందోళన చెయ్యడం, యంత్రాలతో కాల్వలో పూడిక తీసి నీటి ప్రవాహ వేగాన్ని పెంచడం వంటి తాత్కాలిక చర్యలతో కాల్వల రూపురేఖలను మార్చేస్తున్నారు. ఈ కారణంగా క్యూసెక్కుల లెక్కలు క్షేత్రస్థాయిలో తప్పుతున్నాయి. ఎగువన అతివృష్టి, దిగువన అనావృష్టిలా కాల్వల్లో నీటి ప్రవాహం ఉంటోంది. ఇప్పటికైనా కాల్వల కొలతలు సరిచెయ్యకపోతే కోనసీమలో పొలాలు బీడు పెట్టే పరిస్థితి ఏర్పడే ప్రమాదముంది.

అన్వేషణ

- కౌంటింగ్ ఏజెంట్లకు సవాలక్ష నిబంధనలు
- అనుభవజ్ఞులు, ఓర్పు, సహనంతో ఉండే వారికోసం వెతుకులాట
- స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్ల పాస్‌లకు డిమాండ్



అమలాపురం టౌన్, మే 21: సార్వత్రిక ఎన్నికల్లో చివరి ప్రక్రియ ఓట్ల లెక్కింపు. ఈ ఎన్నికలు నువ్వా.. నేనా అన్నట్టు జరిగాయా.. వార్ వన్ సైడేనా అని తెలియాలంటే మరో రెండు వారాలు ఆగాల్సిందే. అత్యంత కీలకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీనిలో భాగంగా లెక్కింపులో పాల్గొనే ఏజెంట్ల కోసం వివిధ రాజకీయ పార్టీలు అన్వేషణ ప్రారంభించాయి. విద్యావంతులు, నేరచరిత్ర లేనివారు, గతంలో ఓట్ల లెక్కింపులో పాల్గొన్న అనుభవం ఉన్నవారి కోసం ఆయా పార్టీలు గాలిస్తున్నాయి. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి చివరి ఓటు లెక్కింపు పూర్తయ్యే వరకు ఓర్పు, సహనంతో ఎవరైతే వేచి వుంటారో అటువంటి వ్యక్తులను నియమించడానికే ఆయా పార్టీలు కృషి చేస్తున్నాయి. నమ్మకస్తులైన పార్టీ శ్రేణులను, బంధువర్గాలను సైతం కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించేందుకు ప్రధాన పార్టీలు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ స్థానానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జూన్ 4న కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుంది. ఇప్పటికే కౌంటింగ్ కేంద్రాల వద్ద జిల్లా యంత్రాంగం మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసింది. కౌంటింగ్ ఏజెంట్లు నేరుగా ఈవీఎంలను తాకడానికి వీలులేని రీతిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే లెక్కింపులో పాల్గొనే ఏజెంట్లకు ఎన్నికల కమిషన్ కఠినమైన నిబంధనలు పెట్టింది. నేరచరితులు కాకుండా ఉండాలని, మద్యం, ఇతర మత్తుపానీయాలు సేవిస్తే నిరాకరిస్తామని తేల్చి చెప్పింది. సెల్‌ఫోన్లు, సిగరెట్లు, అగ్గిపెట్టెలు వంటివి తీసుకెళ్లకూడదు. ఈ నేపథ్యంలో ప్రధానమైన టీడీపీ, వైసీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల తరఫున ఏజెంట్లుగా పనిచేసేందుకు ఎంపిక చేసిన వ్యక్తుల జాబితాను ముందుగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు ఆమోదం నిమిత్తం అందించాలి. సదరు ఏజెంట్లకు ఫొటో గుర్తింపు కార్డుతో కూడిన అనుమతి పత్రాన్ని రిటర్నింగ్ అధికారులు జారీ చేస్తారు. నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపునకు నిర్ణయించిన టేబుళ్ల ప్రకారం కౌంటింగ్ హాలులో ఎన్ని టేబుళ్లు ఉంటే అంతమంది ఏజెంట్లతో పాటు కొందరిని రిజర్వు ఏజెంట్లుగా కూడా సిద్ధంగా ఉంచుతారు. ఏ కారణం చేతనైనా ఆ ఏజెంట్‌కు అస్వస్థత కలిగినా, ఇతర ఇబ్బందులు సృష్టించినా, సిబ్బందిపై దురుసు ప్రవర్తన చేసినా అటువంటి వారిని తక్షణం అక్కడి నుంచి తొలగించి రిలీవింగ్ ఏజెంట్లుగా ఉన్న వ్యక్తులను ఆయా టేబుళ్ల వద్ద నియమిస్తారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలకు ఇది కీలక పరీక్ష కావడంతో విద్యావంతులు, నమ్మకస్తులు, ఓర్పు, సహనంతో పనిచేసే వ్యక్తులనే ఏజెంట్లుగా నియమించుకోవడానికి ఆయా పార్టీలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో జాబితాలను కూడా సిద్ధం చేసుకుంటున్నారు.

అమలాపురం లోక్‌సభ స్థానానికి 15 మంది అభ్యర్థులు బరిలో నిలవగా ఏడు అసెంబ్లీ స్థానాలకు 91 మంది పోటీపడ్డారు. స్వతంత్ర అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్ల పాస్‌లను కొనుగోలు చేసే పనిలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు బరిలో ఉండగా అందులో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు వున్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఏడు నుంచి ఎనిమిది మంది స్వతంత్రులు ఉన్నారు. వారికిప్పుడు మంచి డిమాండ్ ఏర్పడినట్టు సమాచారం. స్వతంత్ర అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగా ప్రధాన పార్టీల అనుచరగణాన్నే నియమించుకునే విధంగా లోపాయికారీ ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. కౌంటింగ్ ఏజెంట్లకు పారితోషికాన్ని ముట్టజెప్పేందుకు ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఏర్పాట్లు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.


అల్లవరం మండలం బోడసకుర్రులో టిడ్కో గృహాల సముదాయంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ హరీష్‌కుమార్

జిల్లావ్యాప్తంగా కార్డన్ సెర్చ్

134 మోటారు సైకిళ్లు, 3 ఆటోలు సీజ్

అమలాపురం టౌన్, మే 21: ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లావ్యాప్తంగా పోలీసులు, కేంద్ర బలగాలు సంయుక్తంగా క్యాసో (కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్) నిర్వహించారు. జిల్లాలో డాక్యుమెంట్లు లేని 134 మోటారు సైకిళ్లతో పాటు మూడు ఆటోలను గుర్తించి సీజ్ చేసినట్టు అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా తెలిపారు. అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, రూరల్ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.హరీష్‌కుమార్ బోడసకుర్రులోని టిడ్కో గృహ సముదాయంలో క్యాసో నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడంతో పాటు చట్టవిరుద్ధమైన వాటిని తనిఖీ చేశారు. డాక్యుమెంట్లు లేని 16 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను సీజ్ చేశారు. మత్స్యకార గ్రామమైన పొరలో నిర్వహించిన క్యాసోలో భాగంగా డాక్యుమెంట్లు లేని ఎనిమిది బైకులు, ఆటోను సీజ్ చేశారు. భైరవపాలెంలో నిర్వహించిన దాడుల్లో 21 మోటారుసైకిళ్లు, ఒక ఆటోతో పాటు 1450 లీటర్ల డీజిల్‌ను సీజ్ చేశారు. మండపేట సీఐ ఎస్కే. అఖిల్‌జమ, ఎస్ఐ హరికోటి శాస్త్రి ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో 18 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ఎస్ఐ కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో 15 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. రామరాజులంకలో సీఐ గోవిందరాజు, ఎస్ఐ బి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 50 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ మెర్ల వీధిలో నిర్వహించిన క్యాసోలో ఆరు మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదంటూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందేలా

ఉపాధి హామీలో పూడికతీత పనులు

అమలాపురం టౌన్, మే 21: పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందించేలా ప్రస్తుత సీజన్లో ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాల్వలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా డ్వామా, జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారంరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. పోలింగ్ అనంతరం శాంతి భద్రతలు, తాగునీటి సమస్యలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. అనంతరం అధికారులనుద్దేశించి కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ వేసవిలో పంట కాల్వలకు నీటి సరఫరా నిలిపివేసినందున ఉపాధి హామీలో ఫీల్డు ఛానల్స్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు పూడికతీత పనులకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు.


వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

జూన్ 4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, ఇతర సిబ్బంది వివరాల జాబితాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపునకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలకు అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లేందుకు ప్రత్యేక దారులు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూములు, తలుపులకు వేసిన సీలు, అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, పరిసరాలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రజలు, మీడియా ప్రతినిధులు పూర్తి సంయమనం పాటించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రాల పరిధిలో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తిగా నిషేధించామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సీపీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు టి.వైద్యనాథశర్మ, పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని 21 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయన్నారు. జనరల్, ఒకేషనల్ కోర్సులను జంబ్లింగ్ విధానంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. 144 సెక్షన్ అమలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు బస్సు సర్వీసులు నడపాలని రవాణా శాఖ అధికారులకు సూచన చేశారు.

అంతర్వేదిలో నేడు నృసింహ జయంతి

జూన్ 21న సప్తనదీ తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం

అంతర్వేది, మే 21: అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా బుధవారం ఉదయం నృసింహ జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఉదయం 5.30 గంటలకు భక్తుల ఆర్జిత అభిషేకం, 8.30 గంటలకు నక్షత్ర మాల దీక్షవిరమణ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం జరుగుతాయన్నారు. 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకుభక్తుల దీక్ష విరమణ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠాపన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, దీక్ష విరమణ చేసిన భక్తులకు ఆశీర్వచనం జరుగుతాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అష్టోత్తర కలశాల మండపం ఏర్పాటు, సంకల్పం, అనంతరం అభిషేకం, అలంకారం, ధూపసేవ, నివేదన, పవళింపు సేవ జరుపుతారు.

జూన్ 21న జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి తత్కాల పౌర్ణమి జ్యేష్ఠ నక్షత్ర పర్వదినం సందర్భంగా స్వామివారి మూలవరులకు ఉదయం గంగా, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనదలచిన భక్తులు రూ.400 టిక్కెట్‌ను ఆలయ కౌంటర్ వద్ద తీసుకోవాలని సహాయ కమిషనరు సత్యనారాయణ సూచించారు.



కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే
కృష్ణబాబు ఇక లేరు

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి
- దొమ్మేరు జమిందార్‌గా సుపరిచితం
- ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి..
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం
- నాడు ఉమ్మడి పశ్చిమను శాసించిన నాయకుడు
- భార్య మరణంతో ఇంటికే పరిమితం

కొవ్వూరు, మే 21 : ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలపాటు కింగ్‌మేకర్‌గా వ్యవహరించిన కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందారు పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు)ఇక లేరు. ఆయన వయసు 71 ఏళ్లు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య నాగమణి కొన్నేళ్ల క్రితమే మరణించారు. అప్పటినుంచి ఇంటికే పరిమితమయ్యారు.

కృష్ణబాబు ప్రస్థానం

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ పిలుపుతో కృష్ణబాబు 1982లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1983, 1985, 1989, 1994, 2004 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో మాత్రం ఓటమి పాలయ్యారు. సుమారు 23 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కొనసాగించారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా నాయకుడిగా పేరు పొందారు. నిజాయితీతో, నిస్వార్థంగా ప్రజాసేవ చేయడం వల్ల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగారు. కొవ్వూరుతోపాటు, పోలవరం, గోపాలపురం, చింతలపూడి, తణుకు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించేవారు. ఉమ్మడి పశ్చిమలో అన్ని నియోజకవర్గాల్లోను అభిమానులను, అనుచరగణాన్ని కలిగి ఉన్నారు. నాలుగు దశాబ్దాలపాటు జిల్లా రాజకీయాలను శాసించారు. మెట్ట ప్రాంతంలోని నాయకులు, కార్యకర్తలు ఆయన మాట జవదాటేవారు కాదు. జిల్లా పరిషత్, జిల్లా సహకార కేంద్రబ్యాంక్ చైర్మన్ల ఎంపికలోనూ కీలకపాత్ర పోషించేవారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో కొవ్వూరు ఎస్సీ రిజర్వు కావడంతో ఆయన పోటీకి దూరమయ్యారు. 2012 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. ప్రస్తుతం వైసీపీ కేంద్రపాలక మండలి సభ్యులుగా కొనసాగుతున్నారు. ది ఆంధ్రా సుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల శ్రీరామచంద్ర వెంకటకృష్ణరంగారావు, అచ్చాయమ్మ దంపతులకు కృష్ణబాబు మూడో సంతానంగా 1953 మే 31న జన్మించారు. ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్‌కు సోదరి కుమారుడు. బోళ్ల బుల్లిరామయ్యకు బావమరిది. ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)లకు సోదరుడు. కృష్ణబాబుకు ఇద్దరు కుమారులు వెంకట్రాయుడు, రవిబాబు (ఎం.డి విభాస్ పాలిమర్స్), కుమార్తె అర్చన ఉన్నారు. కుమారులు పారిశ్రా మికవేత్తలు కాగా, కుమార్తె గృహిణి, అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ ప్రస్తు త రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్నారు.

నేడు అంత్యక్రియలు

కృష్ణబాబు భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి కొవ్వూరు మండలం దొమ్మేరులోని వారి నివాసానికి తీసుకువస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దొమ్మేరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో కృష్ణబాబు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కృష్ణబాబు



2023లో పుట్టినరోజు వేడుకలలో కేక్ కట్ చేస్తున్న కృష్ణబాబు



టీడీపీ నాయకులతో కృష్ణబాబు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌తో బాబు

కృష్ణబాబు మరణం తీరనిలోటు

కృష్ణబాబు మరణం జిల్లావాసులకు తీరని లోటని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. 'ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఆయన వెంటనే స్పందించేవారు. ఆయన హయాంలోనే నియోజకవర్గంలో పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేసి, రైతులకు సాగునీరందించారు. 2003 గోదావరి పుష్కరాలకు కొవ్వూరు పట్టణాన్ని అభివృద్ధి చేశారు. అచ్చాయమ్మ కాలనీలో పేదలకు ఇళ్ళస్థలాలు అందించారు' అని కొనియాడారు. కృష్ణబాబు మృతికి సంతాపంగా బుధవారం నియోజకవర్గంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలంతా సంతాప దినంగా పాటించాలని కోరారు. సంతాపం తెలిపిన వారిలో కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, ఇమ్మణ్ణి వీర శంకరం, పేరిచర్ల బోసురాజు, కేవీకే రంగారావు, పెనుమాక జయరాజు, పిక్కి నాగేంద్ర సంతాపం తెలిపారు.

కృష్ణబాబు మృతికి హోం మంత్రి సంతాపం

దేవరపల్లి, మే 21: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు మృతి పట్ల హోం మంత్రి తానేటి వనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యర్నగూడెం క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కృష్ణబాబు ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణబాబు మరణం వ్యక్తిగతంగా తనకు, తమ పార్టీ తీరని లోటన్నారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావుతో కృష్ణబాబుకు ఉన్న సాన్నిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. తన రాజకీయ ఎదుగుదలకు ఎంతో కృషి చేశారన్నారు. అలాగే చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాట్రగడ్డ శ్రీనివాస్‌చౌదరి.. కృష్ణబాబు మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి మెట్ట ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు.

కృష్ణబాబు మృతికి చంద్రబాబు సంతాపం

కొవ్వూరు, మే 21: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతి పట్ల టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యేగా కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి కృష్ణబాబు విశేష సేవలు అందించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

మునిపల్లిలో వివాహిత మృతి

● ఆత్మహత్యగా కేసు నమోదు ● అల్లుడే హత్య చేశాడని తల్లి ఆరోపణ



నాగారపు లలిత(ఫైల్)

ఉప్పలగుప్తం, మే 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం మునిపల్లిలో సోమవారం రాత్రి ఒక వివాహిత మృతి అనుమానాస్పదంగా మారింది. తన కుమార్తెను అల్లుడే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని తల్లి ఆరోపిస్తోంది. మునిపల్లికి చెందిన వివాహిత నాగారపు లలిత (29) భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వాడపర్రు ఇందిరానగర్‌కు చెందిన లలితతో మునిపల్లికి చెందిన భీమేంద్రకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలు తరచూ గొడవపడుతుండేవారని... ఈ నేపథ్యంలో భర్త వేధింపులతో లలిత ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ మహేశ్వరరావు సందర్శించి వివరాలు సేకరించారు. తన కుమార్తెను అల్లుడే హత్యచేశాడని మృతురాలి తల్లి పరమట పుష్పావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అల్లుడికి వివాహేతర సంబంధాలున్నాయని, ఆ కారణంగానే దంపతులిద్దరూ తరచూ గొడవలు పడుతుండేవారని ఫిర్యాదులో పేర్కొంది.

ఉప్పుటేరులో దూకి వివాహిత ఆత్మహత్య



బోరా దుర్గ

కొత్తపల్లి, మే 21: వివాహేతర సంబంధం కారణంగా ఏర్పడిన మనస్పర్థల కారణంగా వివాహిత ఉప్పుటేరు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమరవల్లిలో మంగళవారం జరిగింది. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమరవల్లి గ్రామానికి చెందిన బోరా దుర్గ(38) అనే వివాహిత అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేత సంబంధం కొనసాగిస్తోంది. వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వ్యక్తి అవసరమైనప్పుడు దుర్గ నుంచి చాలా కాలంగా నగదును తీసుకొంటూ వస్తున్నాడు. డబ్బుల విషయంలో ఏర్పడిన మనస్పర్థల కా రణంగా ఇటీవల ఇద్దరు గొడవలు పడ్డారు. ఈనేపథ్యంలో ఆ వ్యక్తి పెట్టే బాధలు భరించలేక ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య చేసుకొందని పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త రాంబాబు ఫిర్యాదుమేరకు కొత్తపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

● బస్సు ప్రమాద ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య



చిలకలపూడి సురేష్(ఫైల్)

పి.గన్నవరం, మే 21:ఈనెల 14న అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతా వారిపేటలో జరిగిన ఈప్రమాద ఘటనలో నలుగురు కూలీలు (చిలకపూడి మణిబాబు, నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యప్రకాష్, ఈరి కట్టయ్య) అక్కడికక్కడే మృత్యువాత పడగా మరో యువకుడు చిలకలపూడి సురేష్(35)ను చికిత్స నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించి ఈనెల 17న వైద్యులు సూచన మేరకు కాకినాడ ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత సురేష్ కన్నుమూశాడు. స్థానిక ఎస్‌ఐ బి.శివకృష్ణ పంచనామా కార్యక్రమాలు పూర్తి చేసి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆ....తల్లికి గర్భశోకం మిగిల్చిన ఇద్దరు కుమారులు

ఈప్రమాద ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న రోధన వర్ణణాతీతం. చేతికి అందివచ్చిన కొడుకులు ఇద్దరు ఒకేసారి కళ్ల ముందు లేకపోవడంతో దేవుడు గర్భశోకాన్ని మిగిల్చారని రోధిస్తుంది. ఉడిమూడి శివారు ఆదిమూలంవారిపాలెంనకు చెందిన చిలకలపూడి వెంకటేశ్వరావు, సత్యనారాయణమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాద ఘటనలో చివరి ఇద్దరు కుమారులు సురేష్, మణిబాబు మృతి చెందడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామాన్ని సైతం శోకసముద్రంలో ముంచెత్తింది.

పిఠాపురంలో
అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

● బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ రాస్తారోకో



బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు



పిఠాపురం అగ్రహారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

పిఠాపురం, మే 21: పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ దళిత సంఘాల నేతలు రాస్తారోకోకి దిగారు. పిఠాపురం పట్టణంలోని అగ్రహారం పశువుల సంత సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ముఖంపై గుర్తు తెలియని వ్యక్తులు గాట్లు పెట్టారు. విషయం తెలుసుకున్న దళిత సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు మంగళవారం సాయంత్రం అక్కడకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వీరి ఆందోళనతో ట్రాఫిక్ భారీగా జామ్ అయింది. న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న పిఠాపురం ఇన్‌చార్జి సీఐగా ఉన్న సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, పిఠాపురం ఎస్‌ఐ మురళీమోహన్, అదనపు ఎస్‌ఐ వెంకటేష్‌లు అక్కడకు చేరుకున్నారు. ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. ఆందోళనకారులతో మాట్లాడారు. దర్యాప్తు చేపట్టి బాధ్యులను గుర్తించి అరెస్టు చేస్తామని సీఐ వైఆర్‌కే హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం దళిత సంఘాల నాయకులతో కలిసి సీఐ అంబేడ్కర్ విగ్రహానికి రంగు వేసి పాలాభిషేకం నిర్వహించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవరపల్లిలో 226 రాగి దిమ్మలు స్వాధీనం

● నలుగురి అరెస్టు

దేవరపల్లి, మే 21: దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా మంగళవారం 226 రాగి దిమ్మలను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం దేవరపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద కేసు వివరాలను వెల్లడించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పెదపూడి గ్రామానికి చెందిన సుంకర సతీష్, కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి దుర్గ, నక్కా నాగేంద్రకుమార్, నెల్లూరి లోవరాజు కాకినాడ, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రాత్రిళ్లు దొంగతనాలు చేస్తుంటారు. సుంకర సతీష్ పెదపూడిలో పాత ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. నాగేంద్ర, దుర్గ, లోవరాజు ఇంటింటికీ వెళ్లి ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే వీరు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగిలించేవారు. ఆ రాగివైరును సతీష్‌కు అమ్ముతుంటారు. సతీష్ వ్యాపారాన్ని విస్తరించి కొద్దికాలం కిందట తాడేపల్లిగూడెంలోని డంపింగ్‌యార్డు వద్ద షాపు తెరిచాడు. దొంగిలించిన రాగివైరును అందులోనే కరిగించి దిమ్మలుగా చేసి అమ్మడానికి తరలిస్తుంటారు. 120 వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు పగలగొట్టి కాపర్‌వైరు దొంగిలించారు. 226 రాగి దిమ్మలను ఆరుమూటల్లో పెట్టుకుని వ్యాన్లలో అమ్మకానికి విజయవాడ బయలుదేరారు. దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఎస్‌ఐ కె.శ్రీహరిరావు సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. నలుగురిని అరెస్టుచేసి, సుమారు రూ.6లక్షల విలువైన చోరీ సొత్తుతోపాటు మినీవ్యాన్, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ రామారావు తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్‌బాబు, రాజమండ్రి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కే.రజనీకుమార్, ఎస్‌ఐ శ్రీహరిరావు పాల్గొన్నారు.



చోరీ సొత్తుతో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ రామారావు

ఏపీ ఈఏపీసెట్‌కు
రెండు సెషన్లలో 1478 మంది హాజరు

జేఎన్టీయూకే, మే 21: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మంగళవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 597 మంది విద్యార్థు హాజరు కావాల్సి ఉండగా 581 మంది హాజరయ్యారని, 16 మంది గైర్హాజరు కాగా, 97.32 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 920 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 897 మంది హాజరయ్యారని, 23 మంది గైర్హాజరు కాగా 97.50 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లలో 1,517 మంది హాజరుకావాల్సి ఉండగా 1,478 మంది హాజరయ్యారని 39 మంది పరీక్ష రాయలేదని 97.43 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకోసం రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 1,422 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1395 మంది హాజరుకాగా మొత్తం 98.10 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు సెషన్లలో మంగళవారం నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 690మంది హాజరు కావాల్సి ఉండగా 672 మంది హాజరుకాగా మొత్తం 97.39 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఈనెల 23 వరకూ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశపరీక్షలు కొనసాగుతాయన్నారు.

అడ్డతీగలలో పెట్రోల్ రూ.200

అడ్డతీగల, మే 21: అడ్డతీగల గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో గత మూడు రోజుల నుంచి పెట్రోల్ నిల్వలు లేక మండలం లోతట్టు గ్రామాల సైతం ఒక లీటర్ పెట్రోల్ రూ.180 నుంచి రెండు వందల రూపాయల వరకు అమ్మడంతో వాహనదారులు అల్లాడిపోతున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు పెట్రోల్ బంక్‌లలో తప్ప ప్రైవేటుగా పెట్రోల్ అమ్మకాలను నిషేధించారు. అడ్డతీగల బంక్‌లో పెట్రోల్ లేకపోవడంతో పెట్రోల్‌ను మైదాన ప్రాంతం నుంచి రవాణా చేస్తున్నారు.

వేదఘోషతో పులకించిన సత్యదేవుడి సన్నిధి

- ఘనంగా పండిత సదస్యం
- సుమారు 100 మంది పండితులకు సత్కారం



పండిత సదస్యం కార్యక్రమానికి హాజరైన పండితులు



పండితులను సత్కరిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, మే 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి మంగళవారం వేదఘోషతో పులకించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేదాలలో నిష్ణాతులైన పండితులు తమ వేదవిద్యను స్వామివారి పాదాలచెంత ఉంచి పునీతులయ్యారు. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం పండిత సదస్యం అత్యంత ఘనంగా జరిగింది. మధ్యాహ్నం 3గంటలకు నవవధూవరులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అనివేటి మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై ఆశీనులు గావించి మరో వేదికపై క్షేత్రపాలకులు సీతారాములను ఉంచి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పండితులంతా తమ పాండిత్యంతో షైమరిపింపచేశారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 100మంది పండితులను పూలమాలలు, దుశ్శాలువా కప్పి, విసినకర్రను అందజేసి నగదు పురస్కారాలను ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు అందజేశారు. కార్యక్రమం అనంతరం పండితులంతా నవ దంపతుకు వేదాశీర్వచనాలు అందజేశారు.

పొన్నవాహనంపై విహరించిన స్వామి,అమ్మవార్లు



పొన్నవాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి నవదంపతులు పొన్నవాహనంపై విహరించారు. చైర్మన్ రోహిత్ టెంకాయికొట్టి కార్యక్రమం ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

సత్యదేవుడి చక్రస్నానం కోసం ఏర్పాట్లు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో ముఖ్య ఘట్టాలలో ఒక్కటైన చక్రస్నానం నిర్వహణకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది పంపా రిజర్వాయర్‌లో నీటిమట్టం లేకపోవడం, పుష్కరజలాల కోసం ప్రయత్నించిన అది సాధ్యపడకపోవడంతో ఉన్న కొద్దిపాటి నీటిని ఎక్స్‌కవేటర్‌తో చిన్నకొలను ఏర్పాటుచేసి నీటిని కొలనులోకి ప్రత్యేకమార్గం ద్వారా నీటితో నింపుతున్నారు.

పీఏపీఎస్‌లకు కామన్ సర్వీస్ సెంటర్స్ పోర్టల్‌పై శిక్షణ

● రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్టీ శ్రీనివాస్

కాకినాడరూరల్, మే 21: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సహకారం ద్వారా ఆర్థిక సమృద్ధిలో భాగంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కామన్ సర్వీస్ సెంటర్స్ పోర్టల్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అర్హత కల్పించుట ద్వారా ఆర్థిక వనరులను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకొందని రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్టీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా రానున్న 3 నెలల్లో శిక్షణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఏపీలో 1858, తెలంగాణలో 390 సంఘాల పరిధిలో ఈ శిక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల 288 మంది పీఏసీఎస్‌లలో ఈ శిక్షణ చేపడతామని దీని కోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకోవడం జరుగుతుందని శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వంచే గుర్తించిన సాంకేతిక నిపుణులు పాల్గొంటారని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తిగా ఆర్థిక సహకారాన్ని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కల్పిస్తున్నదని, న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ కోఆపరేటివ్ ట్రైనింగ్ సంస్థ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

నిరాధార వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ



కాకినాడ క్రైం, మే 21 : ఎన్నికల లెక్కింపు రోజు, తర్వాత కాకినాడసిటీ, పిఠాపురం నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు జరిగే అవకాశం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న సందేశాల్లో ఏమాత్రం నిజంలేదని, తప్పుడు వదంతులు వ్యాప్తిచేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ హెచ్చరించారు. గత రెండురోజులుగా వివిధ సామాజిక మాధ్యమాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగాల్లో కౌంటింగ్ రోజున, కౌంటింగ్ తర్వాత కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గం పరిధిలో పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందంటూ నిఘా విభాగం నుంచి ఎన్నికల కమిషన్‌కు నివేదికలు వెళ్లాయని వస్తున్న వార్తల్లో ఎటువంటి నిజం లేదన్నారు. కాకినాడ జిల్లాలో గత నాలుగు నెలలుగా కేంద్ర పారా మిలటరీ బలగాల సమన్వయంతో పోలీసులు పూర్తిస్థాయిలో గస్తీ నిర్వహించారని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసులు కృషి చేశారన్నారు. నేర ప్రవృత్తి గలవారిని, సమస్యలు సృష్టించే వారిని మండల రెవెన్యూ అధికారి, మేజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల సంఘం, ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో శాంతి భద్రతలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

నిబంధనలు అనుసరించి బ్రిడ్జిని పూర్తిచేయాలి

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఏఐఐబీ బృందం



గంటిపెదపూడిలో వంతెన పనులను పరిశీలిస్తున్న ఏఐఐబీ బృందం

పి.గన్నవరం, మే 21: నిబంధనలు అనుసరించి నిర్ణీత సమయంలో బ్రిడ్జిని పూర్తిచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఏసియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) బృందం సూచించింది. గంటిపెద పూడిలో లంక గ్రామాల ప్రజలు రాకపోకల కోసం నదీపాయపై నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి పనులను ఏఐఐబీ బృందం పరిశీలించి అనంతరం సంబం ధిత కాంట్రాక్టర్ పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐఐబీ పరిధిలో జరుగుతున్న ప్రాజెక్టుల్లో ఈప్రాజెక్టు పనులు నిబంధనలు ప్రకారం జరుగుతున్నాయని కితాబుచ్చారు. అంతేకాకుండా నిబంధనల్లో భాగంగా ఎక్స్‌కవేటర్‌ను మహిళ ఆపరేటింగ్ చెయ్యడంపై హర్ష వ్యక్తంచేసి సంబంధిత ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం ఇప్పటివరకు జరిగిన పనుల్లో భాగంగా మూడు బాక్స్ కల్వర్టులు, ఒక అబట్ మీట్, నాలుగు పిల్లర్లు, 250 మీటర్ల అప్రోచ్‌రోడ్డు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అనంత రం ఇప్పటివరకు జరిగిన కాల్వపై వంతెన, హైలెవిల్ బ్రిడ్జి పనులకు బిల్లులు మంజూరు చేసే విధంగా సిఫార్సు చేస్తామని చెప్పారు. వంతెన నిర్మాణం నిమిత్తం భూములు ఇచ్చిన రైతులకు త్వరితగతిన నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిశీలనలో సీఈ సీవీ సుబ్బారెడ్డి, ఈఈ రమణమూర్తి (విజయవాడ), ఎస్ఈ వి.రవీంద్ర, ఈఈ కె.చంటిబాబు, ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు, ఏఐఐబి బృందం సభ్యులు పరాద్ అహ్మద్, కౌశిక్ రహమాన్(బంగ్లాదేశ్), అశోక్‌కుమార్(ఇండియా), యోగేష్ మల్లా(నేపాల్), లారా(ఫిలిపిన్), ప్రాజెక్ట్ అడ్వయిజర్ ప్రభాకరరెడ్డి, నరసింహారావు, ఏఈఈ సత్యనారాయణ, కొండలరావు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుకు ఆధార్‌తో అనుసంధానం తప్పనిసరి

యానాం, మే 21: యానాం నియోజకవర్గంలోని రేషన్‌కార్డు వినియోగదారులందరూ రేషన్‌కార్డుతో ఆధార్‌కార్డును అనుసంధానం చేయించుకోవాలని యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు అనుసంధానం చేయించుకోకపోతే పుదుచ్చేరి ప్రభుత్వ అమలు చేస్తున్న డీబీటీ పథకాలు, ఇ-మోడ్ చెల్లింపులు, నగదు సబ్సిడీ, గ్యాస్ సబ్సిడీ తదితర పథకాలు అందవన్నారు.

రోడ్డు వేశారు... కల్వర్టులు మరిచారు




తాపేశ్వరం, ద్వారపూడి మధ్య పంట కాల్వలపై శిథిలావస్థకు చేరిన వంతెనలు

● తాపేశ్వరం నుంచి ద్వారపూడి మధ్య శిథిలావస్థకు చేరిన కల్వర్టులపై వంతెనలు

మండపేట, మే 21: తాపేశ్వరం నుంచి ద్వారపూడి మధ్య కేంద్ర ప్రభుత్వ నిధులు సెంట్రల్ రోడ్డు ఫండ్ రూ.12.5 కోట్లతో చేపట్టిన సీసీరోడ్డు, బీటీ రోడ్డు పనులు ప్రజా ఉద్యమాలు, ప్రతిపక్షాల పోరాటలు చేయడంతో పూర్తయ్యాయి. తాపేశ్వరం నుంచి ద్వారపూడి మధ్య ఏడు కిలో మీటర్ల రోడ్డులో 2.5కిలో మీటర్లు సీసీ రోడ్డు, 3.5కిలో మీటర్లు బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా నిర్మించాల్సిన సీసీ డ్రైన్స్, పంట కాల్వలపై శిథిలా వస్థకు చేరిన వంతెనలు పనులు నేటి వరకు చేపట్టలేదు. వేసవి నేపథ్యంలో పంటకాల్వలు మూసివేయడంతో రహదారులు, భవనాల శాఖాధికారులు పనులు చేపట్టాల్సి ఉంది. చేపట్టిన పనులకు సం బంధించి కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో కాం ట్రాక్టర్ కల్వర్టు పనులు, డ్రైన్ల పనులు చేపట్టడం లేదని ఆ శాఖాధికారులు చెబు తున్నారు. ఈగ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా 750మీటర్ల సీసీ డ్రైన్లు, పంటకాల్వలపై శిథిలా వస్థకు చేరిన ఐదు వంతెనలు తాపేశ్వరం, ఇప్పనపాడు, చిన ద్వారపూడి మధ్య నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈవంతెనలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం కాల్వలు మూసి వేసిన నేపథ్యంలో పంట కాల్వలకు నీరు వదలక ముందే కల్వర్టులపై వంతెనలు, డ్రైన్ల పనులు చేపట్టి పూర్తిచేయాలని ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆదిలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు



ముమ్మిడివరం: ఆదిలక్ష్మి అమ్మవారు, కపిలేశ్వరపురం: పల్లాంబిక అమ్మవారు, అంబాజీపేట: చింతాలమ్మ అమ్మవారు, రావులపాలెం: వాకులమ్మ అమ్మవారు

ముమ్మిడివరం, మే 21: గాడిలంక గ్రామదేవత శ్రీరాజరాజేశ్వరి(ఆదిలక్ష్మి) అమ్మవారి జాతర, తీర్థమహోత్సవాలు మంగళవారం నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి జాతర నిర్వహించారు. మంగళవారం అమ్మవారి తీర్థ మహోత్సవం జరిగింది. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గిరిగి సాయిరామ్, మహాదశ గంగాధరరావు, పెద్దిరెడ్డి మునీంద్రరావు, మహాదశ లక్ష్మీనారాయణ, తోట చిన్నారావు పాల్గొన్నారు.

ఘనంగా చింతాలమ్మ అమ్మవారి తీర్థం

అంబాజీపేట, మే 21: మొసలపల్లి గ్రామదేవత శ్రీచింతాలమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలు, కోయిడ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శివకేశవుల ఆలయంలో వైశాఖ పూజ

అంబాజీపేట, మే 21: గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న శ్రీఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీభూదేవి శ్రీదేవి సమేత కేశవస్వామివార్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం వైశాఖ పూజ నిర్వహించారు. అల్లాడ భాష్యకార్లు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి వెంకటనరసింహశర్మ, సుదర్శనం కేశవచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు

కాట్రేనికోన, మే 21: మంగళవారం కాట్రేనికోనలో మావుళ్ళమ్మ, ఉప్పూడిలో గంగాదేవర మల్లమ్మ తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి మావుళ్ళమ్మ, మల్లమ్మ దేవాలయాల ఆధ్వర్యంలో పెద్ద జాతర కార్యక్రమాలు జరిగాయి. మావుళ్ళమ్మ ఆలయం వద్ద ప్రత్యేక ఆకర్షణగా చొప్పెల్ల గ్రామ కళాకారులతో పార్వతీపరమేశ్వరుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మావుళ్ళమ్మతల్లి తీర్థం సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు దంపతులు, సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, ప్రముఖ వస్త్రవ్యాపారి గ్రంధి నారయణమూర్తి, గ్రంధి నాగేశ్వరరావు పూజలు చేశారు. ఉప్పూడి మల్లమ్మ తల్లికి స్థానిక సర్పంచ్ రంబాల రమేష్ దంపతులు, ఎంపీటీసీ ర్యాలి వీరబాబు, సొసైటీ చైర్మన్ సలాది తులసీరావు, ఆలయ చైర్మన్ రంబాల చౌదరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పల్లాంబిక అమ్మవారి గ్రామోత్సవం, తీర్థం

కపిలేశ్వరపురం, మే 21: చినకోరుమిల్లిలో కొలువైయున్న శ్రీ పల్లాంబిక అమ్మవారి గ్రామోత్సవం, తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని పెదకోరుమిల్లి గ్రామంలోని మహాలక్ష్మమ్మ ఆలయం నుంచి గరగలతో ఊరేగింపుగా చినకోరుమిల్లి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, చీరలు, రవికలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు బెల్లం పానకం అందజేశారు. అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆర్ల అక్కమ్మతల్లి తీర్థ మహోత్సవం

అయినవిల్లి, మే 21: కొండుకుదురు గ్రామదేవత ఆర్ల అక్కమ్మతల్లి జాతర, తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ సోమవారం రాత్రి అమ్మవారి జాతర నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారు. గండర దీపాలు, మంగళ వాయిద్యాలతో జాతరలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. జాతరకు భక్తులు పోటెత్తడంతో వీధులన్నీ కిటకిటలాడాయి.

వాకులమ్మ ఉత్సవ మహోత్సవాలు

రావులపాలెం, మే 21: రావులపాలెం గ్రామ దేవత శ్రీవాకులమ్మ అమ్మవారి ఉత్సవ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకరణ నేత్రపర్వంగా ఉంది. బుధ, గురువారాల్లో తీర్థ మహోత్సవాలు జరుగుతాయి.

నేడు ఇటికాలమ్మ అమ్మవారి జాతర

అంబాజీపేట, మే 21: మాచవరం గ్రామదేవత శ్రీఇటికాలమ్మ అమ్మవారి జాతర బుధవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో గరగనృత్యాలు, సాంస్కృతికకార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గురువారం తీర్థం జరుగుతుందని తెలిపారు.

● ముమ్మిడివరంలో పేరుకుపోతున్న చెత్త
● పారిశుధ్య సిబ్బంది కొరత ● రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజల ఆందోళన

ముమ్మిడివరంలో అపారిశుధ్యం



ముమ్మిడివరం 6వ వార్డులో చెత్త తొలగించకుండా వదిలేసిన డస్ట్‌బిన్



రోడ్డు పక్కన చిందరవందరగా ఉన్న చెత్త

ముమ్మిడివరం, మే 21: ముమ్మిడివరంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి పందుల స్వైర విహారంతో ఈగలు, దోమలు చేరి దుర్గంధం వెలువడుతోంది. చెత్త సేకరణకు సంబంధించి ఏర్పాటుచేసిన డస్ట్‌బిన్ల మూతలు సక్రమంగా లేకపోవడం, డస్ట్‌బిన్ నుంచి ఏరోజుకారోజు పారిశుధ్య కార్మికులు చెత్తను తరలించకపోవడంతో కుక్కలు, పందులు ఆ చెత్తను చిందరవందర చేస్తున్నాయి. దీంతో దుర్గంధం వెలువడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీలోని ఇరవై వార్డుల్లో 25,355మంది జనాభా ఉండగా ప్రధాన పట్టణ పరిధిలో 3, 4, 5, 6, 16, 17, 18, 19 వార్డులు ఉన్నాయి. ఈవార్డుల్లో రోజూ ఎక్కువ మొత్తంలో చెత్త వస్తుంది. నివాస గృహాలతో పాటు హోటళ్లు, ఇతర దుకాణాల నుంచి అధిక మొత్తంలో చెత్త పేరుకుపోతుంది. సుమారు పట్టణ ప్రాంతంలో పది నుంచి పన్నెండు టన్నుల చెత్త రోజుకు వస్తుంది. చెత్త సేకరణకు సంబంధించి 40 నుంచి 50 మంది వరకు పారిశుధ్య కార్మికులు అవసరం అవుతారు. ప్రస్తుతం పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు ఒకరు, 25 మంది అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో పారిశుధ్య నిర్వహణలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభమవ్వడంతో అంటు రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణకు సరైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

అంబాజీపేట, మే 21: ఖరీఫ్ పంటకు సంబంధించి విత్తనాలను ఆయా గ్రామాల ఆర్బీకే పరిధిలో రైతులకు అందుబాటులో ఉంచాలని పిగన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ పంటకు సంబంధించి స్వర్ణ, ఎంటీయూ 1064, 1318 వరి రకాలకు కిలోకు రూ.5వంతున ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. వరి విత్తనాలతో పాటు ఎరువుల స్టాక్ సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం పంట కోత ప్రయోగాలకు సంబంధించి కిట్లను అందజేశారు. సమావేశంలో ఏవోలు సీహెచ్‌డీ విజయకుమార్, ఎ.కల్యాణ్, సూర్యకుమార్, మృదుల, ఎఈవో డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గొయ్యి తీసి వదిలేశారు



ఆత్రేయపురం, మే 21: ర్యాలి జగన్మోహినీకేశవ స్వామి ఆలయానికి వెళ్లే మలుపులో విద్యుత్ స్తంభం కూలిపోవడంతో పక్కనే మరొకటి ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కనే తీసిన గొయ్యిని పూడ్చక పోవడంతో ప్రమాదం పొంచి ఉంది. అసలే ఇరుకురోడ్డు. నిత్యం ట్రాఫిక్ రద్దీ. ఈగొయ్యి వద్ద రాత్రివేళల్లో ప్రయాణికులు ఆదమరిస్తే అంతే సంగతులు.

సుబ్బారావుకు డాక్టరేట్



కొత్తపేట, మే 21: కవి, గాయకుడు, నటుడు, అధ్యాపకుడు, పాత్రికేయుడు... ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన వీవీవీఎస్ సుబ్బారావుకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈనెల25న చెన్నయ్‌లోని భారతీయ విద్యా భవన్‌లో జరిగే కార్యక్రమంలో సుబ్బారావు డాక్టరేట్‌తో పాటు భారత కళారత్న అవార్డు అందుకోనున్నారు. ఆయన్ను పలువురు అభినందించారు.

నిత్యాన్నదానానికి 21వేలు విరాళం

మామిడికుదురు, మే 21: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి అల్లవరం మండలం తాడికోనకు చెందిన ఉంగరాల రత్నకుమారి రూ.21,004 విరాళంగా అందించారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

రాజీవ్‌గాంధీ వర్ధంతి



అమలాపురం: రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న సుభాషిణి తదితరులు

అమలాపురం టౌన్/రూరల్, మే 21: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని అమలాపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో నిర్వహించారు. అమలాపురం అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి అయితాబత్తుల సుభాషిణి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పేరి శర్మ, ఆర్లపల్లి ముత్యం, కట్టోజు శ్రీను, అయితాబత్తుల కుమార్‌సింగ్, కోలా రమణ పాల్గొన్నారు. బండారులంకలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ కార్యాలయంలో కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు.రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలను వక్తలు కొనియాడారు. రెడ్డి బాబు, చంద్రమౌళి సురేష్‌శర్మ, షకీల, వడ్డి నాగేశ్వరరావు, మాచవరపు శివన్నారాయణ, యార్లగడ్డ రవీంద్ర, వస్కా బాబుపాల్గొన్నారు.

మండపేట: కాంగ్రెస్ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి ముగుళ్ల శ్రీను, మగ్గం జాకబ్, రాజబాబు, కుచ్చు బాబి, పల్లదాస్ చిన్న, పిల్లి అప్పన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముమ్మిడివరం: రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో మంగళవారం నిర్వహించారు. పోలమ్మ చెరువుగట్టున ఉన్న బుద్ధ విహార్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.ఉదయభాస్కరవర్మ, వడ్డి నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, ఎ.పండుబాబు, దివి వెంకన్నబాబు, సీహెచ్ బాలకృష్ణ, గిడ్డి రాజు, కముజు రాంబాబు పాల్గొన్నారు.

యానాం: స్థానిక ఫెర్రీరోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సీఐ షణ్ముగం తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

మామిడికుదురు: రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పి.గన్నవరం కాంగ్రెస్ అభ్యర్థి కొండేటి చిట్టిబాబు కొనియాడారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని నగరంలోని చిట్టిబాబు నివాసం వద్ద మంగళవారం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ, నాయకులు గెడ్డం వెంకటేశ్వరరావు, నాగవరపు నాగరాజు, వాణరాశి దొరబాబు, కొండేటి వెంకటేశ్వరరావు, మట్టా సునీల్, అంబటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా కొత్తపేట అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రౌతు ఈశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2న సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం



మహాయజ్ఞం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, మే 21: ప్రపంచ శాంతి కోరుతూ విశ్వహిందూ పరిషత్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జూన్ 2న సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం శ్రీసుభద్ర నర్సింగ్ హోమ్‌లో ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జూన్ 1న హనుమజ్జయంతి సందర్భంగా 2న అమలాపురం గండు వీధిలోని మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో మహాయజ్ఞం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టామన్నారు. శ్రీదత్తపీఠం అధిపతి సాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ, హిమాలయ రుషి స్వామి సూర్యభాస్కరేంద్ర సరస్వతి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర ప్రాంత కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్ హనుమాన్ చాలీసా మహా యజ్ఞం విశిష్టతను వివరిస్తారని తెలిపారు. యజ్ఞం విజయవంతం కోరుతూ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ కొప్పినీడి వెంకటరమణకుమార్, గన్నవరపు అంజనీశ్రీనివాస్, బులుసు జగదీష్, గొవ్వాల నాగరాజు, గొవ్వాల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.



అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, మే 21: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఆకాష్ పట్నాఘర్- అంబిక దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా మంగళవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,19,240 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దు

మామిడికుదురు, మే 21: ఎన్నికల కౌంటింగ్ రోజున ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ సూచించారు. పెదపట్నంలంక, అప్పనపల్లి గ్రామాల్లో ప్రజలకు మంగళవారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని యువత, పెద్దలకు వివరించారు. ఎన్నికల కోడ్‌తో పాటు 144సెక్షన్ అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో నగరం ఎస్ఐ పి.సురేష్, సర్పంచ్ సుందరనీడి చిన్నీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య

మామిడికుదురు, మే 21: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అధ్యాపకులు బోధిస్తున్నారని డీఆర్డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అజయ్, ప్రిన్సిపాల్ సాయిబాబు పేర్కొన్నారు. కళాశాలలో ప్రవేశాల కోసం అవగాహన సదస్సును మామిడికుదు మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తమ కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఇతర సౌకర్యాలు ఉన్నాయని, తమ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, నల్లి రాజు, బాలు, నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

'నల్లా'కు అన్నమయ్య పురస్కారం



అమలాపురం టౌన్, మే 21: అమలాపురం పట్టణానికి చెందిన సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ (చిత్తూరు), ఏఎస్ ఫౌండేషన్ (తిరుపతి) సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమయ్య పురస్కారానికి ఎంపికచేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కళ, సాహిత్య రంగాల్లో నిరంతర సేవలు అందిస్తున్న 116మందిని అన్నమయ్య పురస్కారాలకు ఎంపిక చేశారు. ఈనెల26న చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లెలో జరిగే వేడుకలో ఈపురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మడవల్లి చిరంజీవి, కార్యదర్శి పెంజేటి తిమ్మక్క ఎంపిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్నమయ్య పురస్కారానికి ఎంపికైన నరసింహమూర్తిని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అభినందించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ద్రాక్షారామ, మే21: యానాం నుంచి రెండు మద్యం సీసాలు తరలిస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన మందా చంద్ర లక్ష్మణకుమార్‌ను వేగాయమ్మపేట వద్ద మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు.


రేపు బుద్ధ జయంతి వేడుకలు



బుద్ధవిహార్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీబీ లోక్

అమలాపురం టౌన్, మే 21: ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ), త్రిరత్న బుద్ధవిహార్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు తెలిపారు. బుద్ధ విహార్‌లో మంగళవారం డీబీ లోక్ అధ్యక్షతన బీఎస్ఐ నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ దుర్గారావు మాట్లాడుతూ బుధవారం ఉదయం 9గంటలకు బౌద్ధ భిక్షువుల ప్రార్థనతో జయంతి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లా అధ్యక్షుడు కాశి రాంబోధి, ప్రధాన కార్యదర్శి ఈవీవీ సత్యనారాయణ, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, గెడ్డం ప్రదీప్, ములపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ఆత్రేయపురం, మే 21: జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం ర్యాలి, ఆత్రేయపురం గ్రామాల్లో ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సెక్షన్ 144, 30 అమలులో ఉన్నాయన్నారు. గుంపులు గుంపులుగా కౌంటింగ్ కేంద్రానికి వెళ్లడానికి, ర్యాలీలు, సభలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

కిడ్నాప్, హత్యాయత్నంపై సమగ్ర విచారణ చేయాలి



బాధితునితో మాట్లాడుతున్న మానవహక్కుల నాయకుడు

మలికిపురం, మే 21: గోగన్నమఠానికి చెందిన కోరుకొండ రాజ్‌కుమార్ కిడ్నాప్, హత్యాయత్నంపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని మానవహక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు డిమాండు చేశారు. మంగళవారం ఆయన మలికిపురంలో విలేకరులతో మాట్లాడుతూ రాజోలు ప్రభుత్వాసుపత్రిలో బాధితుడు రాజ్‌కుమార్‌ను కలిసి విషయాలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఈనెల14న మధ్యాహ్నం కొంత మంది వ్యక్తులు రాజ్‌కుమార్‌ను కిడ్నాప్‌చేసి కేశనపల్లి బీచ్‌కు తీసుకువెళ్లి విచక్షణా రహితంగా సరుగుడు కర్రలతో కొట్టి చంపే ప్రయత్నం చేసినట్టు రాజ్‌కుమార్ తెలిపాడన్నారు. ఈఘటనలో పది మంది వరకు పాల్గొన్నారని వారిపై కిడ్నాప్, హత్యాయత్నం కేసు పెట్టాలని డిమాండు చేశారు. ఎస్ఐ బి.సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా ఈనెల15న రాజోలు ప్రభుత్వాసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానికి ఆర్థిక సాయం

మలికిపురం, మే 21: జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మలికిపురం గౌతమ్ మోడల్ స్కూలులో ఎన్టీఆర్ అభిమానులు 80మంది రక్తదానం చేశారు. విశ్వేశ్వరాయపురానికి చెందిన ఎన్టీఆర్ అభిమాని దొంగ ఈశ్వరరావు రెండు కిడ్నీలు దెబ్బతిని రెండు నెలల క్రితం మరణించాడు. ఈశ్వరరావు కుటుంబానికి జూనియర్ ఎన్టీఆర్ కార్యాలయం నుంచి అందిన రూ.50 వేలు, అమలాపురం పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ రూ.50వేలు అందించారు. కార్యక్రమంలో మలికిపురం, సఖినేటిపల్లి మండలాల జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘ అధ్యక్షుడు చెల్లుబోయిన నాని, పిల్లి బాచి, చక్రి, బాబీ, మంగెన నాని, కాకి లక్ష్మణ్ పాల్గొన్నారు

50రోజుల నుంచి చలివేంద్రం నిర్వహణ

మలికిపురం, మే 21: మలికిపురం మండల పరిషత్ ఆధ్వర్యంలో దిండి చెక్‌పోస్టు వద్ద పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయుల సహకారంతో యాభై రోజుల నుంచి మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నట్టు మంగళవారం ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో నడవాలి

ఆత్రేయపురం, మే21: విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలని ఎస్ఐ బి.శ్రీనివాస్ కోరారు. ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.గ్రంథాలయాధికారి నమశ్శివాయపాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి రూ.10వేలు సాయం

రావులపాలెం, మే 21: రావులపాలేనికి చెందిన ఆలమూరు ప్రసాద్ రజక వృత్తి చేసుకుంటూ తల్లిని పోషిస్తున్నాడు. ప్రసాద్ ఒక కాలు పోలియో కాగా ఇటీవల జరిగిన ప్రమాదంలో రెండో కాలుకు తీవ్ర గాయమైంది. అతడికి శ్రీకాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కార్డన్ అండ్ సెర్చ్‌లో 22వాహనాల స్వాధీనం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 21: రామచంద్రపురం పట్టణంలోని కొత్తూరు టిడ్కో గృహాల్లో మంగళవారం రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ దొరరాజు, ఎస్ఐ కె.సురేష్‌బాబు, క్యూఆర్‌టీ సిబ్బంది కార్డర్ అండ్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులులేని 22 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రికార్డులుంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వాహనాలను తీసుకు వెళ్లవచ్చన్నారు. రికార్డులు లేని వాహనాలపై చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చి అపార్ట్‌మెంట్లలో ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు




ముమ్మిడివరం, మే 21: ముమ్మిడివరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లికి చెందిన పి.సాయి తేజ మోటారుసైకిల్‌పై వెళ్తూ టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన పినిపే వెంకటేష్‌ను, స్కూటీపై వెళుతున్న ముమ్మిడివరానికి చెందిన గుబ్బల త్రిమూర్తులును ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న పుచ్చకాయల దుకాణంలోకి దూసుకుపోయాడు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సాయితేజను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్వల్పగాయపడ్డ త్రిమూర్తులు, వెంకటేష్‌లను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: బాక్
శ్రీలలిత	: మిరల్
శేఖర్ స్ర్కీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్ర్కీన్-2	: దర్శిని
రమా	: ఆ ఒక్కటి అడక్కు
గణపతి	: రత్నం
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కింగడమ్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: నటరత్నాలు